శిక్ష వెంటనే అమలుచేయాలి



కోల్‌కతా ఘటన చాలా దారుణం. ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వారిని శిక్షించే విధానం చాలా వేగంగా ఉండాలి. ఆ విధానం బహిర్గతం చేయాలి. అప్పుడే ఆ శిక్షల గురించి తెలిసి భయపడే పరిస్థితి వస్తుంది. శిక్షలు వేసే సమయాన్ని కాలయాపన చేస్తే వారు బయటకు వచ్చి మళ్లీ మళ్లీ అలాంటి సంఘటనలకు పాల్పడే అవకాశం ఉంటుంది. దీన్ని మరికొందరు అలుసుగా తీసుకునే దుస్థితి ఏర్పడుతుంది. శిక్ష తక్షణం అమలు చేసే విధానం వస్తే బాగుంటుంది.

–డాక్టర్ డి.ప్రదీప్‌కుమార్, మెడికల్ అధికారి, చేవేంద్ర పీహెచ్‌సీ, పెడన



భద్రత ఏర్పాటు చేయాలి



ప్రభుత్వ ఆసుపత్రులకు రకరకాల ప్రజలు వస్తుంటారు. పీహెచ్‌సీల్లో కూడా అత్యవసర కేసులు వస్తే 24 గంటలూ పని చేస్తున్నాయి. డ్యూటీలో నర్సులు, మహిళా సిబ్బంది ఉంటారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాలతో పాటు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి. పీహెచ్‌సీల్లో ఉన్న సీసీ కెమెరాలు సమర్థంగా పని చేసేలా ఏర్పాటు చేయాలి. అప్పుడు భయం లేకుండా అందరూ ఉద్యోగాలు చేస్తారు.

– డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఘంటసాల

క్లుప్తంగా

సహాయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మచిలీపట్నంటౌన్: సహాయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలి పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రూ. 15కే భోజనం కార్యక్రమం ప్రారంభించి ఏడాది పూర్తైన సందర్భంగా వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఖాజావలి మాట్లాడుతూ కరోనా సమయం నుంచి సహాయ ఫౌండేషన్ చేస్తున్న సేవలు చూస్తున్నానని, వారి కార్యక్రమాలు మెచ్చి నేను కూడా ఫౌండేషన్ సభ్యుడిగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, ఫౌండేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్ బాషా, స్టార్ విద్య సంస్థల అధినేత పి.శ్రీరామ్, సహాయ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ పరీక్షలు

గూడూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బీఎస్సీ శేఖర్‌సింగ్ తెలిపారు. 1 నుంచి 8వ తరగతులకు సీబీఏ పద్ధతిలో ఓఎంఆర్ విధానంలోను, 9,10 తరగతులకు రెగ్యులర్ పద్ధతిలో నాన్ సీబీఏ విధానంలో పరీక్షలు జరుగుతాయని ఆయన వెల్లడించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నడుచుకోవాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



అన్నవరం(మోపిదేవి): వెంకటాపురం శివారు అన్నవరం గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాద బాధితురాలు పేరుబోయిన నాంచారమ్మకు విస్సంశెట్టి మారుతీరావు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. సోమవారం బాధితురాలిని కలసి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. అనంతరం 25 కిలోల బియ్యం కట్ట, నూతన వస్త్రాలు, రూ. 1,000 నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. జిల్లా ఆర్యవైశ్య ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ విస్సంశెట్టి మొగలేశ్వర గుప్తా, జనసేన మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ అధ్యక్షులు యర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లెలమ్మ జాతర

మెరకనపల్లి(మోపిదేవి): మెరకనపల్లి గ్రామంలోని మల్లెలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా కోనేరు కృష్ణమూర్తి జ్ఞాపకార్థం కోనేరు సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో రజక సంఘం వారికి వస్త్రాలు పంపిణీ చేశారు. జాతర సందర్భంగా బంధుమిత్రులతో గ్రామంలో పండుగ, సందడి వాతావరణం నెలకొంది.

హోమియో కళాశాల్లో పీజీ కోర్సులకు అనుమతులు

గుడివాడరూరల్: గుడివాడ డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాల్లో 2024-25 వార్షిక విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ జాతీయ హోమియో మండలి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ల కొరత, వసతులేమి, ఇతర కారణాలతో హోమియో కళాశాల్లో 24పీజీ కోర్సు సీట్లను కేంద్ర ప్రభుత్వం గతంలో నిలుపుదల చేసింది. సీట్ల రద్దుతో తాము నష్టపోతున్నామంటూ విద్యార్థులు ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి కోర్సులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఆయూష్ కమిషనర్‌తో సమస్యపై ఫోన్‌లో మాట్లాడారు. ఎన్‌సీహెచ్ అధికారులు 2024-25 సంవత్సరాలకు పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

పామర్రు: ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పామర్రు వైద్యులను కోరారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. వైద్యశాలలో రోగులను వారికి అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఇన్‌పేషెంట్స్ ఎవరూ లేరని గుర్తించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో వైద్యశాలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించి ఆరోగ్యవంతులుగా మార్చాలన్న బాధ్యత వైద్యులపై ఉందన్నారు. వైస్ ఎంపీపీలు ఆరిపల్లి శ్రీనివాసరావు, అరుమక్క రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన రక్షిత పథకం

- ముక్కొల్లు సామూహిక రక్షిత నీటి పథకానికి దుస్థితి
- 16 గ్రామాలకు శుద్ధి చేయని నీరు
- తాగునీటికి కష్టం



ముక్కొల్లులోని సామూహిక రక్షిత నీటి పథకం ఇదే

గూడూరు: ముక్కొలు రక్షిత మంచినీటి పథకం పడకేసింది. ఇక్కడ 15 రోజులుగా మోటార్ మరమ్మతులకు గురవడంతో తాగునీటికి కష్టంగా మారింది. గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాల నిర్వహణ పంచాయతీలకు భారం కావడంతో ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు అందేది కాదు. దీని దృష్ట్యా ప్రభుత్వం ముక్కొల్లు సామూహిక రక్షిత నీటి పథకానికి రూపకల్పన చేసింది. శుద్ధి చేసిన నీటిని పైపుల ద్వారా గ్రామాలకు సరఫరా చేయడం దీని లక్ష్యం. ప్రతి రోజూ 12 లక్షల లీటర్ల నీరు శుద్ధి చేసి సరఫరా చేయాల్సి ఉంది.

నీరు సరఫరా అయ్యే గ్రామాలు ఇవే

గూడూరు మండలంలోని 16 గ్రామాలకు రక్షిత తాగునీటిని సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ముక్కొల్లు, ముక్కొల్లు హరిజనవాడ, గంగ్రం, నాగవరం, మందవానిపాలెం, గురిజేపల్లి, షా అబ్దుల్లాపాలెం, లేళ్లగరువు, కంకటావ, రామానుజవత్తర్లపల్లి, గూడూరు, నారికేడాలపాలెం, కొత్తూరు, కోకనారాయణపాలెం తదితరులు గ్రామాలకు ముక్కొల్లు స్కీం నుంచే తాగునీరు సరఫరా అవుతుంది.

కొరవడిన పర్యవేక్షణ



మురికిగా సరఫరా అవుతున్న నీరు

పథకం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాల్సి ఉంది. మోటార్లు మరమ్మతులకు గురైతే నీటి సరఫరా నిలిపి వేయాలి. అంతేగానీ శుద్ధి చేయని నీటిని సరఫరా చేయడంలో మతలబు ఏంటో అర్థం కావడం లేదు. పథకం నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడం కారణంగానే శుద్ధి చేయని నీటిని గ్రామాలకు సరఫరా అవుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామూహకి రక్షిత నీటి పథకాలు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పర్యవేక్షణలో పనిచేస్తాయి. ఆ శాఖ అధికారులు క్రమం తప్పకుండా వెళ్లి నీటి శుద్ధి ప్రక్రియ పరిశీలిస్తూ ఉండాలి. 15 రోజులుగా నీటి శుద్ధి నిలిచిపోయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు ఆరోపణలకు తావిస్తోంది.

రోగాలతో అలమటిస్తున్న జనం

గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతుండటంతో ప్రజలు రోగాలతో అలమటిస్తున్నారు. ఇటీవల రామానుజవత్తర్లపల్లి గ్రామలో ఒకేసారి విషజ్వరాలు ప్రబలాయి. దీంతో మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త పరీక్షలు చేసి జ్వరపీడితులకు చికిత్స అందించారు. ఒక పక్క రోగాలు ప్రబలకుండా ఉండాలంటే పరిశుభ్రమైన నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పే ప్రభుత్వం శుద్ధి చేయని నీటిని సరఫరా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుండటం గర్హించదగ్గ విషయం. శుద్ధి చేయని నీరు సరఫరా జరుగుతుండటంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఫోన్‌లో సంప్రదించాలని యత్నించినా స్పందన లేదు.

లక్ష్యం ఇదీ

గుడ్లవల్లేరు చానల్ నుంచి సరఫరా అయ్యే కృష్ణా జలాలు రాముడు కాల్వ ద్వారా ముక్కొల్లు సామూహిక రక్షిత నీటి పథకానికి నీరు అందుతుంది. ఆ నీటిని ఇంటెక్‌వాల్‌లో ఏర్పాటు చేసిన మోటార్ల ద్వారా రేటియేటర్‌కు సరఫరా అవుతుంది. అక్కడి నుంచి క్యాలిఫ్లోలీటర్‌లో చేరిన నీరు అలం ద్వారా మొదటి దశ శుద్ధి జరుగుతుంది. అక్కడి నుంచి శాండ్ ఫిల్టర్లలోకి పంపి మరింత శుద్ధి చేస్తారు. అలా శుద్ధి అయిన నీటిని క్లోరినేషన్ చేసి సంప్‌లో నిల్వ చేస్తారు. అక్కడ నుంచి మోటార్ల ద్వారా ఓవర్ హెడ్ ట్యాంకులోకి పంపి పైప్‌లైన్ ద్వారా గ్రామాలకు సరఫరా చేస్తారు.



మోటార్ మరమ్మతులకు గురవడంతో క్యాలిఫోలీటర్‌కు చేరని నీరు

శుద్ధి చేయకుండానే సరఫరా



శుద్ధి చేయకుండానే నేరుగా సంప్‌కు మోటార్ల ద్వారా తోడుతున్న నీరు

కాల్వ ద్వారా పథకానికి సరఫరా అయ్యే నీటిని రేడియేటర్‌కు పంపే ఇంటెక్‌వాల్ విభాగంలో 15రోజుల క్రితం మోటారు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి రక్షిత నీటి పథకంలో నీటి శుద్ధి ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో నీటిని శుద్ధి చేయకుండా నేరుగా సంప్‌లోకి పంపించి అక్కడి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ఎక్కించి పైపుల ద్వారా గ్రామాలకు సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీరు మురికిగా, ఆకుపచ్చగా వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిని తాగి రోగాలబారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేతల నిరసన



పెడన: పుల్లపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పులు దండ వేయడం చాలా అమానుషమని వైఎస్సార్ సీపీ మండల నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుత రావు, మున్సిపల్ కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు, పెనుమల్లి సర్పంచి గరికపాటి రామానాయుడు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, జోగి సుబ్రహ్మణ్యం, మత్తె క్రీస్తురాజు తదితరులు విగ్రహం వద్ద తమ నిరసన వ్యక్తం చేస్తూ బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి దండ వేసిన వారు ఎవరైనా విచారణ చేసి అరెస్ట్ చేస్తామని, అనుమానాస్పద కేసు నమోదు చేశామని ఇన్‌చార్జి ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు.

దాడి ఘటనపై కేసు

బంటుమిల్లి: కంచడం గ్రామంలో సోమవారం ఒక వ్యక్తిపై జరిగిన దాడిని పురస్కరించుకుని పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పిన్నింటి రవిపై స్థానికులు బందారు చంద్రశేఖర్, గంధం శేషగిరి, గంధం మణికంఠ దాడి చేశారు. రవిని చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరి మధ్య జరిగిన చర్చ వివాదంగా మారి దాడికి కారణమైనట్లు తెలిసింది. ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు రవి ఇచ్చిన ఫిర్యాదుతో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మృదువదన.. మధుసూదన..

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

కోడూరు: హంసలదీవి క్షేత్రం కృష్ణాష్టమి వేడుకలతో కళకళలాడింది. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారి మూలమూర్తికి విశేష అభిషేకాలు చేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తులకు అన్నసమారాధన జరిగింది. అనంతరం స్వామివార్ల చిత్రపటాలను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. కోడూరులోని పెద్దివారి బజారులోని యాదవల వారి రామాలయం వద్ద స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టారు.

పెడన: పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో పల్లకి సేవ, గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి మహోత్సవం అత్యంత వైభవంగా చేశారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆలయ పూజారి హరిగోపాలకృష్ణ ప్రత్యేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.

పట్టణంలోని కళాంజలి హైస్కూల్‌లో విద్యార్థులు శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విశ్వభారతి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. కరస్పాండెంట్ గౌరీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: మోపిదేవి గొల్లపాలెంలో యువతీ, యువకులు సందడిగా ఉదయం ప్రత్యేక వాహనంపై శ్రీ కృష్ణుని ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్థానిక రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, పాటలు పాడారు. రాత్రి ఉట్టి కొట్టి సందడి చేశారు.



మోపిదేవిలో శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు

గూడూరు: స్థానిక యాదవ రామాలయంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఊరేగించారు. కార్యక్రమంలో పోతన లక్ష్మీనరసింహ స్వామి, కాసగాని శ్రీనివాసరావు, అన్నం హరిరామ కృష్ణ, డొక్కు నాగరాజు, కైలా ప్రతీష్ రాజు, కుందేటి శివ తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక గీతామందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. పెదతుమ్మిడి గ్రామంలోని శ్రీరుక్మిణి, సత్యభామ సమేత కృష్ణ ఆలయంలో కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభించారు. స్థానిక శ్రీ పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉట్టి కొట్టి పండగ చేశారు. బాసినపాడు, గొల్లగూడెం, వెంకటనారాయణపురం తదితర గ్రామాల్లో విశేష పూజలు చేశారు. కంచడంలో అన్న సమారాధన జరిగింది.

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో యాదవ యూత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యాదవ యూత్, భక్తులు పాల్గొన్నారు.



హంసలదీవిలో ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలుడు



వేణుగోపాల స్వామి ఆలయంలో ఉట్టి కొడుతున్న యువత



గూడూరులో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఇంగ్లిషుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకుడు పాల సాయి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపూజ, కృష్ణ భగవానుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్ పర్ణం సతీష్, పార్టీ నాయకులు గాజుల భగవాన్, మహ్మద్ రఫీ, బూరగ రామారావు, పడమట రమేష్ తదితరులు పాల్గొన్నారు. జవ్వారుపేటలోని శ్రీ కృష్ణ మందిరంలో జనసేన నాయకుడు గడ్డం రాజు ఆధ్వర్యంలో జరిగిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విజయ, జ్యోతి, సురేష్, ఇందిర, ఇందిర, రజిని, వాణి తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజలు, భజనలు, ఉట్టికొట్టి సందడి చేశారు.

కృష్ణాతీరంలో కోలాహలంగా..

నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరాన శ్రీరామ పాదక్షేత్రం శ్రీకనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వచ్చిన 40మంది చిన్నారుల ప్రదర్శన జరిపి అందరికి బహుమతులు అందజేశారు. తర్వాత ఉట్టి కొట్టారు. స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకుడు దీవి వెంకట సత్య ప్రసాద్ విశేష పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని జమ్మిచెట్టు వద్ద గోపూజలు, ప్రదక్షిణలు చేశారు. మండలంలోని భావదేవరపల్లి రామాలయంలోని శ్రీకృష్ణుడికి, మర్రిపాలెంలోని పురాతనమైన శ్రీకృష్ణుని దేవస్థానంలో పూజలు జరిగాయి.



కృష్ణాతీరంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రారంభించిన శ్రీనివాసరావు, బాలవర్ధి



చిన్నారులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



సత్యసాయిసేవా మందిరం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా భక్తుల ఊరేగింపు



శ్రీకళాంజలి హైస్కూలులో శ్రీకృష్ణులు, గోపికల వేషధారణలో విద్యార్థులు

క్యూలో నిల్చుని.. టోకెన్లు తీసుకుని..

అన్న క్యాంటీన్ వద్ద క్యూలో నిల్చుని కూపన్లు తీసుకుని కుటుంబంతో సహా అక్కడి భోజనం రుచిచూశారు కలెక్టర్ డీకే బాలాజీ. ఆయన సోమవారం పట్టణంలోని మూడు స్తంభాల సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌కు కుటుంబ సభ్యులతో వెళ్లారు. ఆయన స్వయంగా క్యూలో నిల్చుని ఆయన సతీమణి, తండ్రికి మూడు టోకెన్లను కొనుగోలు చేసి వారితో కలిసి భోజనం చేశారు. క్యాంటీన్‌లో భోజనం రుచిగా ఉందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. - మచిలీపట్నం టౌన్





మదర్‌థెరిసా జయంతి



దుప్పట్లు, గొడుగులు అందజేస్తున్న దృశ్యం



దేవరకోటలో మదర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమూయేలు, సర్పంచ్, ఎంపీటీసీలు

కోడూరు: మదరథెరిసా జయంతిని టీఎస్సార్ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. గ్రూప్ చైర్మన్ తిరుపతి శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్వతంత్రపురం ప్రభుత్వ వైద్యశాలలోని వైద్యులను సత్కరించారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సభ్యులు వేముల వేలాద్రి, వెంకటేశ్వరరావు, తిరుపతి వీరాంజనేయులు పాల్గొన్నారు.

దేవరకోట(ఘంటసాల): దేవరకోటలోని ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో మదర్ థెరిస్సా సేవా సమితి ఫౌండర్ సమూయేలు ఆధ్వర్యంలో థెరిసా జయంతిని సోమవారం నిర్వహించారు. మదర్ విగ్రహానికి ఎంపీటీసీ కొప్పుల రాములమ్మ, సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, సేవా సమితి ఫౌండర్ సమూయేలు పూలమాలలు వేసి నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోలెం శ్రీనివాసరావు, వార్డు మెంబర్ పండు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, గొడుగుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి సెంటర్లోని మదర్ థెరిసా విగ్రహం వద్ద నవ చైతన్య మదర్ థెరిసా సేవా సమితి 18 వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. థెరిస జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేదలకు దుప్పట్లు, గొడుగులు,స్వీట్లు పంచారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, మదర్ థెరిసా సేవా సమితి కమిటీ ప్రతినిధులు కుమ్మరి హర్ష, శేఖరు,నాంచారయ్య,డొక్కు రాజు, రాధా రంగా మిత్ర మండలి నాయకుడు బుల్లెట్ ధర్మారావు, న్యాయవాది లంకి శెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

గుడివాడ టౌన్: స్థానిక కాపు సేవాసమితి సేవల్లో భాగంగా పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసినట్లు సేవా సమితి అధ్యక్షుడు నరహరశెట్టి ప్రసాదు తెలిపారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో సేవా సమితి సభ్యుల సహకారంతో అజయ్ విద్యాభివృద్ధికి వితరణ చేసినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి ఎ.మల్లేశ్వర రావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.